# పునర్జన్మ



"డియర్, పరిమళా!

"నమస్తే అనలేను. మనం రోజూ మొదటిసారి పలకరించుకునేది ఆ పదంతోనే కాబట్టి. మీరు క్షేమమా అనలేను, మిమ్మల్ని రోజూ చూస్తూనే ఉన్నాను కాబట్టి. అసలు అనుక్షణం మిమ్మల్నే చూసే శక్తి భగవంతుడు నాకిస్తే బాగుండును. ఎందుకంటే మిమ్మల్ని చూడకుండా ఒక్కరోజైనా ఉండలేని స్థితికి వచ్చాను. అహా! మీ అందం నన్ను అంతగా ప్రేరేపించింది. ఏ కోణంలో చూసినా అంత అందాన్ని మీలో భగవంతుడు ఎలా పొందుపరిచాడా అనుకుంటేనే ఆశ్చర్యం కలుగుతోంది. రోజుకి ఎన్ని బొమ్మలకి ప్రాణం పోయగలడో తెలియదు గానీ, మీ బొమ్మ మనసుతో చేసి తన తేజస్సు ప్రాణంగా పోశాడని నా ఉద్దేశ్యం.

లేకపోతే నేనేమిటి? మీ ప్రేమలో పడటం ఏమిటి? ఇద్దరు బిడ్డల తండ్రినైన నన్నే చలింపచేసిన మీ సౌందర్యాధకుడును నేను. నాభార్య మీ అంత అందమైనది కాదు. కానీ ఆకర్షణీయమైనదే. ఈ పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేనిది. డైరెక్టుగా చెప్పేస్తే మానసిక వేదన కొంత ఉపశమిస్తుంది అన్న భావనతో మీ ముందు ఈ విషయం ఉంచుతున్నాను. 'ఆడదాని మనసు పాలసముద్రం లాంటిది. అందులో జలకాలాడే అదృష్టం తన అనురాగం పంచుకున్న భర్తకే!' అని ఎక్కడో చదివాను. ఆ అదృష్టం నాకు కలుగజేయమని కోరుతున్నాను.

మీలో నాకు నచ్చని అంశం ఒకటి ఉంది. లంచ్‌బ్రేక్‌లో భోజనం చేసిన తరువాత మీరు టాయ్‌లెట్ అవుతూ అప్పుడప్పుడూ స్టిక్కర్ బొట్టు మర్చిపోయి మీ సీట్లో కూర్చుని పనిలో మునిగిపోవడం. ఇసుకతిన్నెలాంటి మీ నుదురు చూస్తే నా గుండెలు పిండినట్ట వుతుంది అప్పుడు. మీ ఆలోచనలతో నా భార్యకు కూడా కొన్ని సమయాల్లో 'న్యాయం' చేయలేకపోతున్నాను. నాకు ఆన్సర్ టు ది క్వొశ్చన్ పద్ధతి అలవాటు. ఉపోద్ఘాతాలు చిరాకు. అయితే మూడు నెలలుగా నా మానసిక సంఘర్షణకి ధైర్యం మందు వేసుకుని మీ ముందు ఈ వాక్యాలు ఉంచుతున్నాను. మీ వ్యక్తి 'గతం' తో నాకు పనిలేదు. 'ఇలా ఎంతమందికి ఉత్తరాలు రాసి ఉంటాడో' అనుకునే మీ అనుమానానికి తావివ్వకుండా నా భార్య మీద ఒట్టుగా చెబుతున్నాను. నాభార్య తరువాత నాలో స్పందన కలగజేసింది మీరే! అందుకే మీ నిర్ణయం ఖచ్చితంగా తెలియజేయండి.

సంస్కారం గల మీరు ఈ ఉత్తరం మేనేజర్ గారికి ఇవ్వరు. నా భార్యకు పంపిస్తారన్న భయం లేదు. పద్దెనిమిదేళ్ళు కాపురం చేసిన ఆమెకు నేను బాగా తెలుసు. ఆమెను కన్విన్స్ చేసుకోగలను. మీకిష్టం లేకుంటే సింపుల్‌గా 'నో' అని చెప్పేయండి మీ భవిష్యత్తుకు హాని చేస్తుందనుకుంటే ఈ లెటర్ అంటించేయండి.మీ సమాధానం ఎలాంటిదైనా ఐలైక్‌యూ, ఐవాంట్ యూ, ఐ లవ్ యూ ఆల్వేస్. ఉంటాను.

శశికిరణ్."

ఉత్తరం పూర్తిగా చదివిన మృణాళిని తలెత్తి ఎదురుగా తనకేసి ఆసక్తిగా చూస్తున్న పరిమళ ముఖంలోకి చూసింది.

"ఎలా ఉంది మణీ? ఈ వయసులో నాకు వచ్చిన ప్రేమలేఖ?" పరిమళ అడిగింది. ఆ అడగడంలోనే తెలుస్తోంది ఆమె ఎంత రంపపుకోతకు గురైనదీ.

"ఇది మగవాడి పైత్యం. కొవ్వెక్కి పేలే ప్రేలాపన. పరిష్కారం వాడే సూచించాడుగా. సింపుల్‌గా'నో' అని చెప్పేయమని. చెంపమీద కొట్టి మరీ చెప్పండి వెధవకి. బుద్ధొస్తుంది. ఇదేమైనా సినిమా అనుకుంటున్నాడేమో." కసిగా అంది మృణాళిని.

"ఇందులో నా తప్పేమైనా ఉందంటావా? నేను వృత్తిపరంగా తప్ప ఒక్క మాట అనవసరంగా ఆయనతో మాట్లాడలేదు. నాకున్న ఒక్కగా నొక్క స్నేహితురాలివి నువ్వే. ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం చూపగలవని నా నమ్మకం." ఆప్యాయంగా మృణాళిని చేతులను తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా అంది పరిమళ. స్నేహపూర్వకమైన ఆ స్పర్శకు మృణాళిని కళ్ళు చమర్చాయి.

"ఆరు నెలల క్రితం మీరు ఇక్కడ జాయిన్ అయినప్పటినుంచీ చూస్తున్నాను. పని తప్ప అనవసరంగా మాట్లాడడం నేను వినలేదు. మీ కిందస్థాయి ఉద్యోగి అయిన నాతో ఎటువంటి అరమరికలు లేకుండా స్నేహం చేయగలుగుతున్నారంటేనే మీ వ్యక్తిత్వం అర్థమైంది. మీ మీద ఈ ఆఫీసులో చాలామంది మగపురుగుల కళ్ళున్నాయి. అయితే అధికారిణిగా మీ అధికారాన్ని, ఆడదానిగా మీ అందాన్ని వాళ్ళు భరించలేకపోతున్నారు. ఇందులో మీదేమీ తప్పులేదు." స్థిరంగా అంది మృణాళిని.

"మణీ! నీకు నా గురించి తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి. ఇంతకాలం ఆ అవకాశం నేను ఎవరికి ఇవ్వలేదు. అలా ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు కూడా. ఆఫీసులో నాతో కాస్త్తో కూస్తో చనువుగా మాట్లాడేది నువ్వే. ఇప్పుడు ఈ సమస్యని సున్నితంగా పరిష్కరించవలసిన దానివి కూడా నువ్వే. అందుకే రేపు సన్‌డే ఉదయం నుండి సాయంత్రం వరకూ మా ఇంట్లో ఉండి నా జీవిత గ్రంథాన్ని తిరగేద్దువుగాని.

అప్పుడు నీకు పరిష్కార మార్గం సూచించే వీలవుతుంది. సరేనా!"

"ఓకే!" అంగీకారం తెలిపింది మృణాళిని.

ఆ ఎల్ఐసి బ్రాంచ్‌లో ఆరునెలలక్రితం పరిమళ తిరుపతి నుండి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చి జాయిన్ అయిననాటి నుండీ, స్టాఫ్ అందరికీ ఆమె ఒక 'చర్చనీయాంశం' అయింది. ఆబ్రాంచ్‌లోని ఆడవారందరూ మెరుపుతీగలాంటి ఆమె అద్వితీయమైన అందానికి సహజంగా ఈర్ష్య చెందారు. దానికి తోడు సెక్షన్ హెడ్ అయిన్ ఆమె రిజర్వ్‌డ్ బిహేవియర్‌కు 'గర్విష్ఠి' అనే బిరుదు తగిలించి తమ 'ఇగో'ను తృప్తి పరుచుకున్నారు. అయితే మృణాళిని తనకున్న కుటుంబ సమస్యలలో ఆర్థికంగాను , వ్యక్తిగతంగానూ ప్రత్యేక శ్రద్ధతో సహకరించిన పరిమళ వ్యక్తిత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నది. ఆ కృతజ్ఞతా భావమే వారిద్దరి మధ్య పదేళ్ళ వయసు అంతరం ఉన్నా మంచి స్నేహితులుగా చేసింది. సెక్షన్ హెడ్ అన్న అతిశయం ఏమాత్రం లేకుండా తనకు వర్క్‌లో ఏ డౌట్ వచ్చినా ఎప్పుడూ క్లారిఫై చేస్తూ, తనకు హెవీవర్క్ ఉన్నప్పుడు దాన్ని షేర్ చేసుకునే పరిమళ అంటే మృణాళినికి వల్లమాలిన అభిమానం, గౌరవం. తమ స్నేహం మిగతా ఆడవారికి కంటగింపుగా ఉండేది.

ఏదో ఒక సూటిపోటి మాట విసురుతూంటే సహజంగా మాటకారి అయిన మృణాళిని చమత్కార బాణాలతో వాళ్ళనోళ్ళు మూయించేది.

ఈ ఆరునెలల పరిచయంలో మృణాళిని పరిమళను తన ఇంటికి ఎన్నోసార్లు ఆహ్వానించింది. అయితే పరిమళ తన వ్యక్తిగత విషయం వచ్చినప్పుడల్లా సున్నితంగా మాట మార్చేసేది. "టైముంది, వస్తాను!" అని వెళ్ళిపోయేదే తప్ప తన గురించి తెలిసే అవకాశం కల్పించలేదు. తానుగా ఇవ్వలేదు.

ఈ ఆదివారం ఆమె తనను ఆహ్వానించింది. ఆ విధంగా ఆమె గురించి కొన్ని విషయాలైనా తెలుసుకుంటే, ఎంతో సాయం చేసిన ఆమె సమస్యకు పరిష్కారం చూపి కొంతవరకూ రుణం తీర్చుకునే అవకాశం వస్తుంది. తమ స్నేహం మరింత బలపడుతుంది. బాగా ఆలోచించి తిరిగి వాడు తేరుకోని పరిష్కారం ఇవ్వాలి అని నిర్ణయించుకుంది మృణాళిని.

★★★

"రా, మణీ రా! ఇంతకాలానికి నిన్ను మా ఇంటికి ఆహ్వానించే అవసరం కల్పించాడు - ఆ 'మహానుభావుడు'. నిన్ను త్వరలో మరోసారి పిలిచే అవకాశం ఉందిలే రా!" సాదరంగా ఆహ్వానించిన పరిమళ మాటలను స్థితిని దాటి మంత్రముగ్ధలా లోపలికి వచ్చి అడుగుపెట్టింది మృణాళిని. ప్రశాంతత అక్కడి వాతావరణంలో అణువణువునా

గోచరిస్తోంది. ఇళ్ళు చాలామంది కట్టుకుంటారు. కానీ అదొక ఇల్లులా లేదు. ఒక ప్రేమికుడు ప్రేమచిహ్నంగా తన ప్రియురాలికి సమర్పించిన అపురూపమైన కానుకలా ఉంది. ఎక్కడ చూసినా రాధాకృష్ణుల ప్రేమానురాగాల్ని తెలిపే వివిధ భంగిమల బొమ్మలు చెక్కతో చేసినవి, మట్టితో చేసినవి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసినవి.... అనేక సుందర దృశ్యాలు... నగిషీలు చెక్కిన వుడెన్ ఫ్రేమ్‌ల మధ్య బిగించబడి, ఆస్థానంలో అవి లేకపోతే అందమే లేదు అన్నంత వైభవంగా అలంకరించబడి ఉంది ఆ భవనంలోని ప్రతి గదీ. ప్రతీ వస్తువూ ఏదో విధమైన కళతో తన ప్రత్యేకతను చాటుతోంది. మూడు బెడ్‌రూమ్స్, విశాలమైన హాలు, కిచెన్ హాలులోంచి పైకి మెట్లు.... హోమ్‌సైన్స్ చదివినవారు కూడా అంత అందంగా ఇండోర్ ప్లాంట్స్‌ని పెంచలేరేమో అన్నట్లుగా వెరైటీ అండ్ రేర్ కలెక్షన్ ప్లాంట్స్‌ని చూస్తూనే .... సాలార్‌జంగ్ మ్యూజియంలోని చైనా పాత్రల కళావైభవం గుర్తుకు వచ్చింది మృణాళినికి.

ఇల్లంతా చూశాక అడిగింది పరిమళ "ఎలా ఉంది మాయిల్లు?"

"ఇంత అపురూపంగా ఉన్న భవనంలోకి అడుగుపెట్టే అర్హత నాకు ఉందా అని ఆలోచిస్తున్నాను. మేడమ్!" అంది మృణాళిని.

ఆశ్చర్యపోతూ అడిగింది పరిమళ "మళ్ళీ కొత్తగా ఈ పిలుపేమిటి మణీ?"

"నో మేడమ్! అది మీ అంతరంగంలోని అభిరుచిని గుర్తించి వాడిన పదం. దయచేసి ఇకనుండి నన్ను అలాగే పిలవనివ్వండి. అవునూ. ఎవరూ కనబడరేం? ఇంత ఇంట్లో మీరొక్కరేనా?"

సమాధానంగా పరిమళ సమ్మోహనంగా నవ్వి,మృణాళిని చేయి పట్టుకుని ముందుకు నడుస్తూ అంది. "రా, నాగది చూద్దువుగాని!"

ఆమె గది డాబా మెట్ల వెనుక ఉంది. ఆ గదిపైన "పరిమళా నివాస్"అనే పెద్ద అక్షరాలు ఏ చిన్న కాంతి పడినా తళుక్కుమని మెరుస్తూ తమ అందాన్ని ద్విగుణీకృతం చేసుకుంటున్నాయి.

గదిలోకి అడుగుపెట్టిన మృణాళిని సంభ్రమాశ్చర్యాలతో పరికించసాగింది.

గదిలో ఎక్కడ చూసినా "పరిమళా శ్రీనివాస్" అని రాసి ఉంది. కిందా, పైనా, గోడలకు అందంగా పెయింటర్ వ్రాసినట్టుగా అక్కడక్కడా ఆ అక్షరాలను కప్పుతూ పరిమళ - శ్రీనివాస్ ఫోటోలు మాక్సి సైజ్ నుంచి, జైంట్ సైజ్ వరకూ గోడలకు అంటించి ఉన్నాయి. కొన్ని ఫోటోలలో పరిమళ ఒక్కతే ఉంది. అతను ఏదో విసరబోతుంటే తప్పించుకున్నట్టుగా, కోపం వచ్చినట్టుగా, బుంగమూతితో కోతిలా వెక్కిరిస్తూ, ఎర్రని చిగుళ్ళు కనబడేలా నవ్వుతూ, టెన్నిస్ బాట్‌తో, జీన్స్ ఫాంటు

షర్ట్‌లో, పులిపిల్లను చేతులతో పట్టుకుని... రకరకాల ఫోజుల్లో.

ఆమె మంచానికి ఎదురుగా గోడవైపున.... తాజ్‌మహల్ వెనుకనుంచి సూర్యాస్తమయాన్ని చూస్తూ నిలబడిన, ఆమెను చేతులతో బంధిస్తూ రేయాన్ కళ్ళజోడు పెట్టుకున్న అతను.... గోడ అంతటినీ కవర్ చేస్తూ ఫుల్‌సైజు ఫోటో. దాని కింద కుడివైపున ఇలా వ్రాసిఉంది.

"The Light which enlightens the Tajmahal, much beautiful is my love towards you! - నివాస్"

ఆ స్వాప్నిక జగత్తునుండి మృణాళినిని బయటకు తీసుకురావడం కోసం అన్నట్టుగా పరిమళ అంది....

"ఆయన మా వారు, శ్రీనివాస్. ఎంతో మందిలో గాలించి వెదికి మధ్యతరగతికి చెందిన నన్ను వివాహం చేసుకున్నారు. అతి శ్రీమంతుడైన ఆయన సమక్షంలో నా గురించి ఆలోచించుకోవడం మర్చిపోయే టంతగా ప్రేమానురాగాలు కురిపించిన నా భర్త తమకంలోంచి బయటకు లాగుతూ నాకు ముగ్గురు మగబిడ్డలు కలిగారు. మొదటివాడు మహేష్ - ఎమ్.సి.ఎ. రెండవ వాడు జగదీష్ - డిగ్రీ ఫస్టియర్. మూడవవాడు గిరీష్ - ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. ముగ్గురూ వనభోజనానికి వెళ్ళారు."

ఆమె తన మంచం పక్కనున్న టీపాయ్ మీద ఫ్రేమ్స్‌లో నూనూగుమీసాల టీనేజ్‌లో ఉన్న ముగ్గురబ్బాయిల ఫోటోలనూ చూపించింది.

మూడవవాడు అచ్చుగుద్దినట్లు తండ్రిపోలిక.

"మీరు ... మీరు ముగ్గురుబిడ్డల తల్లి అంటే సాక్ష్యంచూపించినా ఈ ప్రపంచం నమ్మదు!". మృణాళిని అంది.

"అందుకే 'నా' అనే విషయం ఏ ఒక్కటీ ఎవ్వరితోనూ చెప్పుకోవడం ఇష్టం ఉండదు మణీ! కావలసినంత డబ్బు ఉండీ, కార్లలో తిరిగే వైభవం ఉండి, ఎక్కడ నుండి వచ్చానో ఆ స్థాయిని మర్చిపోకూడదు అన్న భావంతో జీవిస్తున్నాను. నాకు ఏ కష్టాలూ లేవు ఒక్క భర్తలేని లోటు తప్ప!"

మృణాళిని షాకయింది. పరిమళ కళ్ళల్లో చివ్వున నీళ్ళు చిమ్మాయి.

"ప్రపంచంలోని ప్రేమాను రాగాలు మాకే స్వంతం అన్న రీతిలో బతికిన మమ్మల్ని విడదీసి.... అపురూప జ్ఞాపకాలు నాకు మిగిల్చి ఆయనను తీసుకుపోయాడు భగవంతుడు. ఎల్ఐసిలో రీజియనల్ డైరెక్టర్‌గా ప్రమోషన్ వచ్చిన ఆయన "వద్దండీ!" అంటే వినకుండా నన్ను ఎత్తుకుని గిరగిరా తిప్పేశారు. ఆ ఆనందాతిరేకంలో సివియర్ హార్ట్ ఎటాక్ వచ్చి కూలబడిపోయిన ఆయనను చూసి ఆటపట్టిస్తున్నారనుకున్నాను. నేను తేరుకుని డాక్టర్‌కు ఫోన్ చేయబోయేటంతలో వారించారు. తన పొజిషన్ తెలిసిపోయి

నట్టుంది. నా చేతుల్లో చేయి వేసి మాట తీసుకున్నారు. 'నువ్వు' ఎప్పుడూ నిండు ముత్తయిదువులా ఇలాగే ఉండాలి. పరిమళా! పిల్లలను బాగా చదివించు. నీకు, పిల్లలకు ఏలోటూ రాకుండా అన్ని ఏర్పాట్లు చేశాను. మళ్ళీ జన్మ ప్రసాదిస్తానని ఆ దేవుడు చెప్పినా నీ బాధ్యతలు పూర్తిచేసుకుని నా దగ్గరకు వచ్చేవరకూ ఆగమని ఆయనతో దెబ్బలాడతాను. ఎన్ని జన్మలెత్తినా నువ్వే భార్యగా ఉండేలా నుదుటి వ్రాత వ్రాయమని అడుగుతాను. పరిమళా! ఒక్కసారి నన్ను నీ గుండెల్లో దాచుకోవూ!' అంటూ నా ఒడిలోనే....'' పరిమళ వెక్కి వెక్కి ఏడవసాగింది.

మృణాళినికి కూడా కన్నీళ్ళు ఆగలేదు.

అయిదు నిమిషాలకు తేరుకున్న పరిమళ నెమ్మదిగా లేచింది. "సారీ!సారీ మణీ! నా విషయాలు చెప్పి బాధ కలిగించాను. నన్ను క్షమించు."

"మేడమ్! మీరు..... మీరు అంత మాట అనకూడదు. ఇంతటివ్యథ మీలో దాగుందని మిమ్మల్ని చూసిన ఎవ్వరూ అనుకోరు. మీవంటివారి సాహచర్యం, సాన్నిహిత్యం లభించడం నిజంగా నా అదృష్టం".

"నాకు అతని ఉత్తరమే తీవ్ర మనస్తాపం కలిగించింది. అదేనేను తట్టుకోలేకపోతున్న పెద్దకష్టం." ఇంకా ఆమె వెక్కిళ్ళు తగ్గలేదు.

"మీరేమీ అనుకోనంటే ఒక్క మాట చెప్పనా, మేడమ్?"

"అందుకేగా నీకు నా మనసులో బాధ చెప్పుకున్నది."

"మీ కథ తెలియకముందు శశి కిరణ్ విషయంలో మీ తప్పు ఏమీ లేదని చెప్పాను. ఇప్పుడూ కొంతవరకూ తప్పు మీదీ ఉందని నా అభిప్రాయం."

"మణీ! నువ్వు.... నువ్వు ఆమాట. అంటున్నావా?" అతి సన్నిహితమైన చోట తట్టుకోలేని దెబ్బ తగిలినట్టుగా ఉన్నాయి ఆమె మాటలు.

"పూర్తిగా వినండి. మేడమ్! మన ఆఫీసులో ఉన్న ఆడవారందరూ వయసులోనూ, హోదాలోనూ మీకంటె చిన్నవారు అయినా మీకు మాత్రమే అతడు ఉత్తరం వ్రాసాడంటే ఆ అవకాశం మీరు పరోక్షంగా అతనికి కల్పించారన్నమాట."

"మృణాళినీ"! నిలువునా భూమిలోకి కూరుకుపోతున్నట్టుగా నిస్సహాయంగా అందామె.

"నన్ను క్షమించండి, మేడమ్! నా పాయింట్ ఏమిటంటే అంకుల్ కోరిక ప్రకారం మీరు ముత్తయిదువలా ఉండాలి. ఆయన అనుక్షణం మీ తలపుల్లోనే ఉన్నారనడానికి ఈ గదే ప్రత్యక్షసాక్ష్యం. మీరు ఈగదిలో ఉన్నంతసేపూ ఆయన కోరుకున్నట్టు ఉండి, బయటకు వచ్చినప్పుడు ఆకర్షణ కలిగించే వస్తువులు తీసేయండి. మీది ఎంతో సహజమైన అందం. ఏమీ అలంకరించుకోకపోయినా మహారాణిలా

ఉంటారు మీరు."

"నాకు పూర్తిగా అర్థం కాలేదు. మణీ!"

"మేడమ్!" ఈనాటి సమాజాన్ని పరిశీలిద్దాం. మగవాడు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి పశువుకంటే హీనంగా ప్రవర్తిస్తున్నాడంటే కారణం పూర్తిగా ఆడదే అని నా అభిప్రాయం. పిల్లలుగా ఉన్నప్పుడు గారాంకొద్దీ పట్టించుకోకుండా, వయసు తారతమ్యాలు మరచి తమ పిల్లలముందే సాధ్యమైనంత చిన్నవాళ్ళుగా కనపడాలని తాపత్రయపడుతున్న తల్లులు ఎంతో మంది ఉన్నారు. టీనేజ్‌లోకి వచ్చాక వాళ్ళనేమన్నా అంటే ఉన్న ఒకరిద్దరు పిల్లలూ ఇల్లు విడిచిపోతారనే భయంతో ఏమీ అనక, పెళ్ళయితే వాడే తెలుసుకుంటాడులే అని వదిలేస్తే ఈరోజు మగవాడు ఏం చేస్తున్నాడు? తనను అనుక్షణం రెచ్చగొడుతున్న శృంగార దృశ్యాలతో ప్రేరేపితుడై వావివరుసలు మరచి, మంచిచెడూ అన్నీ వదిలేసి ప్రవర్తిస్తున్నాడంటే ఎవరిది నేరం చెప్పండి?

తండ్రికి తన సంపాదన యావలో పడి కొడుకును పట్టించుకునే తీరిక ఉండదు. తల్లి కూడా ఉద్యోగస్తురాలైతే యిక సరేసరి. అదే గృహిణి అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు యంత్రంలా పనిచేసి ఇంటికొచ్చిన వాళ్ళకు వండి వార్చిపోయడమే తప్ప, పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకోదు. ఒకవేళ పట్టించుకున్నా ఒక వయసు వచ్చాక తల్లిమాట లెక్కచేయరు. ఏ సినిమాకి వెళ్ళినా వెనక సీట్లలో పెళ్ళికాని జంటలే! ఏ సందు మొగలో చూసినా స్ట్రీట్‌లైట్స్‌కింద సైకిలుతో అబ్బాయి, చేతిలో పుస్తకంతో అమ్మాయి. ఎవరైనా కామెంట్ చేస్తే అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటుంది. అబ్బాయి మరో అమ్మాయి వేటలో పడతాడు.

ఏ ఇద్దరు స్త్రీలు కలిసి వెళ్ళినా వాళ్ళు తల్లీకూతుళ్ళో, అత్తాకోడళ్ళో చెప్పగలిగే సమాజం మనకు ఉందా చెప్పండి? లేనిపోని ఫేషన్ల పేరుతో మగవాడిని రెచ్చగొట్టేలా ప్రవర్తించి, 'వాడు నా మీద అత్యాచారం చేశాడని ఫైలు అయిన కేసులకి కారణం ఎవరు? మగాడు కాదు, ఆడది. మారే కాలంతో మనమూ మారాలి. మారమనండి! ఆ మార్పులో మంచిని తీసుకోమనండి. ఎందరుంటారో వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

మగవాడికి మాట అనే అవకాశం మనం ఇవ్వకుండా ఉండాలి. ఒకవేళ వాడే తీసుకుంటే నడిబజారులో చెప్పుతీసుకుని పదిమందికీ తెలిసేట్టు కొట్టాలి. ఆడదానికి స్వాతంత్ర్యం ఇచ్చానని చెబుతూనే, ఎంత అసభ్యంగా స్త్రీని చూపవచ్చో అంత అసభ్యంగా చిత్రించి, ఎల్‌కెజివాడు కూడా లొట్టలేస్తూ చూసేలా సమాజానికి సినిమాల రూపంలో మగవాడు అందిస్తున్నాడు. 'అందం మాలో ఉంది కాబట్టి ఎక్స్‌పోజింగ్ తప్పులేదు అని కొందరూ, అలా చూపకపోతే

ఫీల్డ్‌లో మాకు మనుగడే లేదు' అని కొందరు హీరోయిన్ల స్టేట్‌మెంట్లు.

'నన్ను పోషించాలంటే నువ్వు శరీరాన్నే అమ్ముకోవాలమ్మా'' అన్నది ఒక సినిమా డైలాగ్. ఎంత అద్భుతవాక్యం. మేడమ్ అది! కానీ ఆ సందేశాన్ని నమ్ముకుంటే ఆ ఆడదాని కడుపు నిండదట. ఎలాగూ ఊబిలో దిగాముకదా అని అందులోనే కూరుకుపోయి సమాధి అయిపోతోంది - నేటిస్త్రీ. ఇదంతా ప్రస్తుత సమాజంపట్ల నా విశ్లేషణ మాత్రమే. ఇప్పుడు మీకు అర్థం అయిందనుకుంటాను...!'' ఆవేశంగా అంది మృణాళిని.

''చాలు, మృణాళినీ, చాలు! నాకళ్ళు తెరిపించావు. నాభర్త మాటల్లోని అంతరార్థాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక పోయాను. ఆయన మత్తులోనే ఉన్నాను కదా! నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. ఆ ఉత్తరం అలా రాసేలా అవకాశంపరోక్షంగా శశికిరణ్‌కు నేనే కల్పించానేమో! ఇక మరెవరికీ ఎప్పుడూ అలాంటి ఉత్తరం ఆయన రాయకుండా చెయ్యాల్సిన బాధ్యత కూడా నా మీద ఉంది!'' ఆమె గట్టిగా కళ్ళు తుడుచుకుని అంది.

''నేను వెళ్తాను, మేడమ్! మీ కళ్ళల్లోకి చూడాలంటేనే భయంగా ఉంది.''

''లేదు మృణాళినీ! మనమొకరికొకరం అర్థం అయిన తరువాత పరస్పరం ఒకరిమీద మరొకరికి గౌరవం పెరిగి నిన్ను పూర్తి పేరుతో, నేను నన్ను మేడమ్ అని నువ్వు పిలవడం మొదలుపెట్టాము. వద్దు! మనకా పిలుపులు వద్దు. మనం ఎప్పుడూ అక్కా చెల్లెళ్ళలా ఉందాం. ఏదీ మాట ఇయ్యి!'' అడిగింది పరిమళ చేయి చాచిన పరిమళ చేతిలో చేయి వేస్తూ ''సరే! ఇంతకీ ఏం నిర్ణయించుకున్నారు?'' అడిగింది మృణాళిని.

''రేపు చూస్తావుగా, అతనికి ఎలాంటి సమాధానం చెబుతానో? నువ్వు నా పక్కనే ఉండాలి సుమా, పద భోజనం చేద్దాం!''

పరిమళ మనసు గదిలోంచి బయటకు వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచారు వాళ్ళిద్దరూ.

★★★

మరునాడు ఆఫీసుకు వచ్చిన పరిమళను చూస్తూనే ఆఫీసు సిబ్బంది అంతా కొయ్యబారిపోయారు.

జుట్టు ముడి పెట్టుకుని, నీలం బోర్డర్ ఉన్న తెల్లని చీర, భుజం చుట్టూ నిండుగా కప్పుకుని తన సెల్‌లోకి వెళ్తూ తనను గ్రీట్ చేసిన మృణాళినిని గ్రీట్ చేసింది పరిమళ ప్రశాంతంగా నవ్వుతూ.

ఆమెలో ఎటువంటి ఆకర్షణలూ లేవు. తొలకరి చినుకులకు పునీతమైన లేత తమలపాకులా సామాన్యంగా ఉంది.

లంచ్ బ్రేక్‌లో మృణాళిని, పరిమళ దగ్గరకు వచ్చింది.

''మీరు ... మీరేనా?''

" అంతరంగంలో నా భర్త సజీవంగా ఉన్నంతకాలం నా వేషం ఇంతే! నీ భావం నాకు అర్థమైందని నీకు అర్థమైందా?'' నవ్వింది పరిమళ. ఆమె గదిలో ఫోటోలో విధంగా.

"ఆయనకు సమాధానం చెప్పారా?"

"లేదు అటెండరుతో కబురు చేశాను. అదిగో వస్తున్నాడు చూడు!''

ఠీవిగా వచ్చి నిలబడిన శశికిరణ్‌ని చూసి తలెత్తింది పరిమళ. ఆమె ఏం చేస్తుందా అన్న కుతూహలంతో చూస్తోంది మృణాళిని.

"మిస్టర్ శశికిరణ్! మీరు వ్రాసిన లేఖను ప్రెస్ మీట్ పెట్టి పత్రికలకు విడుదల చేద్దామనుకుంటున్నాను. మీ అభిప్రాయం?''

శశికిరణ్ నిలువెల్లా వణికి పోయాడు. "నో మేడమ్! అయామ్ రియల్లీ సారీ. నన్ను క్షమించండి. యింకెప్పుడూ యిలాంటి ఉత్తరాలు మీకేకాదు. ఎవరికీ వ్రాయను. ప్లీజ్ మేడమ్! నా పరువుపోతుంది" అన్నాడు కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూ.

"మీరు చెప్పినదంతా కాగితం మీద వ్రాసి యివ్వండి. మరోమాట. మీరు వ్రాసిన లెటర్ ఫోటోస్టాట్ కాపీలు తీయించి భద్రపరిచాను. మళ్ళీ ఎవరికైనా యిలా ప్రేమలేఖలు వ్రాశారో ఈసారి కటకటాలు లెక్క పెట్టవలసి వస్తుంది జాగ్రత్త! యిదుగో మీ లెటర్!''.

ఆమె ఒక్కొక్క మాటతో చేతబడి చేయబడిన వాడిలా అయిపోయిన అతను ఆ లెటర్ తీసుకుని జీవం కోల్పోయినవాడిలా వెళ్ళిపోతుంటే మృణాళినితో కరచాలనం చేస్తూ సమస్య తీరిపోయినట్టు హాయిగా నవ్వుకుంది పరిమళ.

●

'ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక'
16-12-2000